# ఆశావాదం

మనం బ్రతకడానికి ఏదో ఒక వృత్తినో, వ్యాపారాన్నో, పరిశ్రమనో ఎన్నుకుంటాం!

మనలో కొందరు రాత్రింబవళ్ళూ శ్రమిస్తారు - ఎంత శ్రమించినా వాళ్ళ పరిస్థితి అంతకంతకీ దిగజారుతుందే తప్ప శ్రమకి తగ్గ ప్రతిఫలం పొందలేరు ! మరి కొందరు... ఏమంతగా శ్రమించరు! అయినా వాళ్ళ అంచనాలకి మించి వాళ్ళింటి ముంగిట కనక వర్షం కురుస్తుంది!

కొందర్ని చూస్తుంటాం ! వాళ్లు ఎన్నో రంగాల్లో అడుగెట్టి, ప్రతీసారీ విజయ లక్ష్మితో తిరిగొస్తారు! అలాంటి వాళ్ళని చూసి - 'వాళ్ళు మట్టి ముట్టినా బంగారమే అవుతుంది' అని ఈర్ష్యపడ్తాం !

మరి కొందర్ని చూస్తాం... వాళ్ళు ఏపని చేసినా కలిసిరాదు ! 'వాళ్ళు బంగారం ముట్టినా మట్టే అవుతుంది' అని ఎద్దేవా చేస్తాం!

ఎప్పుడూ ఏ రంగంలోనూ అడుగెట్టని వాళ్లేకాదు....

ఎన్నో రంగాల్లో విజయం సాధించిన వాళ్ళు కూడా...

ఒక్కోసారి ఊహించని విధంగా, పీకల్లోతు కష్టాల ఊబిలో కూరుకుపోయే సందర్భాలు వస్తూ ఉంటాయి !

ఇలా...

ముళ్ళకంచెలో చిక్కుకుపోయిన వ్యక్తికి అకస్మాత్తుగా పరిసరాలన్నీ పూల వనాలు కావడాన్ని అదృష్టమనీ...

వెన్నెల స్నానాలు చేస్తోన్న వ్యక్తి నెత్తిన ఉన్నట్టుండి నిప్పుల వర్షం కురవడం దుర దృష్టమనీ... చెప్పుకుంటాం !

లేదూ...

మనమనుకున్నది సిద్ధిస్తే చేసిన పూజలు ఫలించాయనో, దైవమహిమనో....

జరక్కూడనిది జరిగితే పూర్వజన్మ కర్మ ఫలమనో, వాస్తు దోషమనో సరిపెట్టుకో చూస్తాం!

అంతేతప్ప - మన వైఫల్యానికి కారణం... మనం చేస్తోన్న పనిలో మనకు అనుభవ రాహిత్యమో, కృషిలోపమో, దుస్సాహసానికి ప్రతిఫలమనో - ఛస్తే అంగీకరించం !

పిల్లలు పుట్టడంలేదనో, పుట్టిన పిల్లలు చదవడంలేదనో, కోరుకున్న మనిషి దక్క లేదనో, ఎవరో మోసంచేశారనో, కష్టార్జితం దోచుకుపోయారనో, వ్యాపారం కలిసిరాలేదనో - మనం నిరాశా నిస్పృహలకు లోనవుతాం !

అనుకున్నది జరగనపుడు...

అశించింది దక్కనప్పుడు...

అడుగడుగునా అపజయాలే చవి చూసినపుడు...

మనుషుల ఆత్మవిశ్వాసం సన్నగిల్లి పోతుంది!

మానసిక ఒత్తిడి భరించలేక ఆత్మ హత్యలకి పాల్పడతారు !



*Contd...*

కానీ, -

మనిషికి ఆలోచించే మెదడుంది!

ఏదో ఒక పనిచేయడానికి చేతులున్నాయి!

**అవేవీ లేని పశుపక్ష్యాదులే ఎవరి 'ఆసరా' లేకుండా నిశ్చింతగా బ్రతికేస్తూంటే... సృష్టిలోని కోటానుకోట్ల ప్రాణులన్నింటిలోకెల్లా ఉత్కృష్టమైన జన్మ ఎత్తిన మనిషి.... 'తనకెవరూ లేర'ని... లేనిపోని చింతలతో ఆత్మహత్యలకి పాల్పడటం.... అవివేకమనిపించుకుంటుంది!**

విరక్తి... వ్యక్తిని శక్తిహీనుణ్ణి చేస్తుంది!

నిస్పృహ... జాతిని నిర్వీర్యం చేస్తుంది !

మన చింతల్నీ చీకాలుల్నీ మటు మాయం చేసి మనసుని చైతన్యవంతం చేయగల దివ్యౌషదం.... ఆశావాదం !

దాన్ని ఒకరందిస్తే సేవించాలని చూడక - మరో బాధాతప్త హృదయానికి అందించాలనే తపన మనం అలవర్చుకోవాలి.



16-08-1995